

ఆక్వా రైతుల చలో అమరావతి

ధరల విషయంలో ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, ఫీడ్ కంపెనీలు దిగిరావడం లేదని, దీంతో జూన్ 10న చలో అమరావతి చేపట్టనున్నట్లు ఆక్వా రైతు ప్రతినిధులు తెలిపారు. 8లో ▸



20 మందికి గాయాలు

వేర్వేరు ప్రమాదాల్లో మంగళవారం 20 మంది కూలీలు, ఒక డ్రైవర్ గాయపడ్డారు. బాధితులకు ప్రభుత్వాసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. 8లో ▸



ఉద్యాన పంటల సాగుపై శ్రద్ధ

ఉద్యాన పంటల సాగుపై వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రంలో అధికారులు, రైతులతో ఏపీఎంఐపీ పీడీ, ఉద్యాన శాఖ జేడీ సమీక్షించారు. 8లో ▸

న్యూస్‌రీల్

102 ఉద్యోగుల బకాయిలు విడుదల చేయాలి



కలెక్టరేట్ వద్ద 102 ఉద్యోగుల ఆందోళన

ఏలూరు (టూటౌన్): తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 ఉద్యోగుల వేతన బకాయిలు విడుదల చేయాలని, కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంగళవారం రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా ఏలూరులో కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డీఎన్‌వీడి ప్రసాద్ మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉద్యోగుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాయని రోజుకి 10 గంటలు పని చేస్తున్నా ఉద్యోగులకు కేవలం రోజుకు రూ.280 మాత్రమే జీతం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలల నుంచి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గత నాలుగు నెలల బకాయిలను విడుదల చేయాలని, కనీస వేతనం రూ.18,500కి పెంచాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షకు 416 మంది గైర్హాజరు

భీమవరం: జిల్లాలో టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన హిందీ పరీక్షకు 416 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ చెప్పారు. హిందీ పరీక్షకు 602 మంది హాజరు కావాల్సివుండగా 186 మంది హాజరయ్యారన్నారు. ఓపెన్ స్కూల్ ఇంగ్లీష్ పరీక్షకు 215 మందికి 50 మంది గైర్హాజరయ్యారన్నారు. ఇంటర్మీడియట్(ఏపీ ఓఎస్ఎస్) పరీక్షకు 223 మందికి 183 మంది హాజరయ్యారన్నారు.

ప్రశాంతంగా ఈఏపీ సెట్ పరీక్ష

భీమవరం: ఏపీ ఈఏపీ సెట్ భీమవరంలో మంగళవారం ప్రశాంతంగా జరిగింది. డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 91 మందికి 82 మంది హాజరు కాగా.. మధ్యాహ్నం 91 మందికి 84 మంది హాజరయ్యారు. డీఎన్నార్ అటానమస్ కళాశాలలో ఉదయం 91 మందికి 89 మంది, మధ్యాహ్నం 90 మందికి 85 మంది హాజరయ్యారు. విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 90 మందికి 81 మంది హాజరుకాగా.. మధ్యాహ్నం 90 మందికి 81 మంది హాజరయ్యారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 102 మందికి 97 మంది హాజరుకాగా మధ్యాహ్నం 104 మందికి 99 మంది హాజరయ్యారు.

జిల్లాలో భారీ వర్షం

భీమవరం: జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. 20 మండలాల పరిధిలో సరాసరి 21 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా కాళ్ల మండలంలో అత్యధికంగా 42.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. వీరవాసరంలో 35 మిల్లీమీటర్లు, పోడూరులో 33.2, పాలకొల్లులో 30.2, భీమవరంలో 29.6, మొగల్తూరులో 25.6, నరసాపురంలో 23.6, తాడేపల్లిగూడెంలో 1.4, పెంటపాడులో 14.6, తణుకులో 15.2, అత్తిలిలో 27.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గణపవరంలో 10.4, ఆకివీడులో 19.8, ఉండిలో 21.2, పాలకోడేరులో 30.4, పెనుమంట్రలో 10.4, ఇరగవరంలో 10, పెనుగొండలో 10.8, ఆచంటలో 20.2, యలమంచిలిలో 8.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

నేడు అజయ్ జైన్ జిల్లా పర్యటన

భీమవరం (ప్రకాశంచౌక్): పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ బుధవారం పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. భీమవరం ఏరియా ఆసుపత్రిని సందర్శించి మౌలిక సదుపాయాలపై సమీక్షిస్తారు. అనంతరం అర్బన్ అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేస్తారు. దీపం పథకం పొందుతున్న లబ్ధిదారుల ఇంటిని క్షేత్రస్థాయిలో సందర్శిస్తారు. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పనులపై అధికారులతో సమీక్షిస్తారు.

సర్పంచ్ చెక్ పవర్ రద్దు

టి.నరసాపురం: టి.నరసాపురం మండలం బొర్రంపాలెం పంచాయతీ సర్పంచ్ కలపర్తి వెంకటేశ్వరమ్మ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ పంచాయతీ అధికారి కె.అనురాధ ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీలో నిధుల దుర్వినియోగమయ్యాయని అదే గ్రామానికి చెందిన పాండురంగ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఉన్నతాధికారులు విచారణ నిర్వహించారు. నివేదిక ఆధారంగా సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దు చేశారు. ఇదే అభియోగంపై బొర్రంపాలెంలో గతంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శి కేఎస్ కృష్ణను ఇప్పటికే ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. గతంలో పనిచేసిన ముగ్గురు కార్యదర్శులు, సర్పంచ్ నుంచి దుర్వినియోగమైన నిధులు రికవరీ చేయాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో తెలిపారు.

మంత్రిగారూ.. మెడికల్ కాలేజీ గుర్తుందా?

- గత ప్రభుత్వంలో రూ.475 కోట్లతో మెడికల్ కళాశాల మంజూరు
- 60 ఎకరాల్లో పనులు ప్రారంభం.. రూ.75 కోట్ల విలువైన పనులు పూర్తి
- గతంలో పలుమార్లు సైట్ వద్దకు వచ్చి హడావుడి చేసిన నిమ్మల
- కూటమి వచ్చాక కన్నెత్తి చూడని వైనం



అర్ధాంతరంగా ఆగిన మెడికల్ కాలేజీ భవనాల పనులు, (ఇన్‌సెట్‌లో) గతంలో పార్కింగ్ స్థలం వద్ద నిరసన తెలుపుతున్న నిమ్మల, చినరాజప్ప (ఫైల్)

సాక్షి, భీమవరం: వైద్య విద్యను పేద విదార్థులకు చేరువ చేసేందుకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కారు జిల్లాకో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టింది. అందులో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు సమీపంలోని దగ్గులూరులో రెండేళ్ల క్రితమే నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆ సమయంలో ×ఇక్కడ బురద తప్ప మెడికల్ కళాశాల పనులేమీ జరగడం లేదు× అంటూ ఎమ్మెల్యేగా ఉన్న నిమ్మల రామానాయుడు ఎంతో హడావుడి చేశారు. పనుల వేగం పెంచాలంటూ పార్టీ పెద్దలను సైతం తీసుకువచ్చి నిరసనలు తెలిపారు. కూటమి వచ్చాక ఆయన్ను మంత్రి పదవి వరించడంతో ఏడాదిలోనే పనులు పూర్తవుతాయని అంతా ఆశించారు. ఇంతవరకూ ఆయన కళాశాల వైపు కన్నెత్తి చూడలేదు. పాలకొల్లు మండలం దగ్గులూరులోని సుమారు 60 ఎకరాల్లో రూ.475 కోట్లతో వైద్య కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. కళాశాల నిర్మాణంతో జిల్లా వాసులకు మేలు జరుగుతుందని, ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని స్థానికులు ఆశించారు.

నిధుల లేక నిలిచిన పనులు

2023 ఆగస్టులో నిర్మాణ సంస్థ పనులు ప్రారంభించింది. ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్, ఎమర్జెన్సీ సేవల బ్లాకులకు సంబంధించి రూ.75 కోట్ల విలువైన పునాది పనులు దాదాపు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాల పనులకు బ్రేక్ వేసింది. ఈ పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడంతో నిర్మాణ సంస్థ పనులను నిలిపివేసింది. సైట్‌లోని ఐరన్, ఇసుక, కంకర, ఇతర నిర్మాణ సామగ్రిని తరలించుకుపోతోంది. పనులు ఆగిపోవడంతో స్థానికుల ఆశలపై నీళ్లు చల్లారు. కాలేజీని ప్రైవేట్ పరం చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. దీని వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్ష అవనుంది.

కళాశాల వైపు చూడని మంత్రి నిమ్మల

గత ప్రభుత్వంలో ఒకపక్క పనులు జరుగుతుంటే.. బురద తప్ప ఇక్కడ నిర్మాణాలు ఏమీ చేయడం లేదంటూ పలుమార్లు సైట్ వద్దకు వచ్చి నిమ్మల హడావుడి చేశారు. మాజీ మంత్రి నిమ్మకాయల రాజప్ప, తదితర పార్టీ పెద్దలను తీసుకొచ్చి నిరసనలు తెలిపి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తోంది. అప్పట్లో వైద్య కళాశాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేసిన నిమ్మల మంత్రిగా ఈ ఏడాది కాలంలో ఒక్కసారి కూడా ఇటు వైపు వచ్చి చూసిన దాఖలాలు లేవు. పబ్లిసిటీ కోసమే గతంలో హడావుడి చేశారని అంటున్నారు. మెడికల్ కళాశాల పూర్తయితే గత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనో, కొన్నాళ్లు ఆగి కొత్తగా తామే మళ్లీ నిధులు మంజూరు చేసినట్టుగా చూపించే ప్రయత్నమో? కారణమేదైనా మెడికల్ కళాశాల ఊసే తేవడం లేదంటున్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి



మెడికల్ కళాశాల ద్వారా పాలకొల్లు, పరిసర ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందుతాయి. నిర్మాణ పనులు పూర్తయితే గత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న భయంలో ఇప్పటి పాలకులు ఉన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా త్వరితగతిన పనులు పూర్తిచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– గుడాల శ్రీహరి గోపాలరావు, వైఎస్ఆర్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి

పనులు ఆపడం సరికాదు



గత ప్రభుత్వం రికార్డు స్థాయిలో రాష్ట్రంలో 15 మెడికల్ కళాశాలల పనులు చేపట్టి ఐదింటిని ప్రారంభించింది. కూటమి వచ్చాక పాలకొల్లులోని పనులను అర్ధాంతరంగా ఆపేయడం సరికాదు. గత ప్రభుత్వంలో కళాశాల పనుల కోసం తపించిపోయిన నిమ్మల మంత్రి అయ్యాక ఒక్కసారి సందర్శించలేదు.

– ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

అలరించిన నాటిక పోటీలు



'జనరల్ బోగీలు' నాటికలో కీలక దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంబికా సంస్థల వ్యవస్థాపకుడు ఆలపాటి రామచంద్రరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అంబికా సంస్థలు, హిందూ యువజన సంఘం, హేలాపురి కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి నాటిక పోటీలు మంగళవారంతో ముగిశాయి. నాలుగో రోజు కొలకలూరు శ్రీ సాయి ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించిన జనరల్ బోగీలు, రెండో ప్రదర్శనగా వీరన్నపాలెం కళానికేతన్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన రుతువు లేని కాలం నాటికలకు ప్రేక్షకులు నీరాజనాలు పట్టారు. అద్భుతమైన కథాంశాలతో నటీనటుల హృద్యమైన నటనతో నాటికలు రక్తికట్టించాయి. అంబికా సంస్థ చైర్మన్ అంబికా కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు పాక సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. నాటిక, నాటకాల ప్రదర్శనలో కళాకారులు అనేక జాగ్రత్తలు తీసుకుంటారని వాటిని గుర్తించి సహకరించాలన్నారు. వైఎంహెచ్ఏ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, సెక్రటరీ కళారత్న కేవీ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షుడు ఇరదల ముద్దుకృష్ణ, సెక్రటరీ మజ్జి కాంతారావు, అంబికా ప్రసాద్, అంబికా రాజా, డెంటల్ కాలేజీ కరస్పాండెంట్ జీ.మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన చికిత్స అందించాలి



నరసాపురం ప్రభుత్వాసుపత్రిలో చంటి బిడ్డను ఎత్తుకున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

నరసాపురం రూరల్: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఆస్పత్రుల్లోనే మెరుగైన పరీక్షలు, చికిత్స అందించాలని, గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవించేలా వారికి అవగాహన కల్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి వైద్యాధికారులకు సూచించారు. మంగళవారం నరసాపురం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపీ రిజిస్టర్లు, పలు విభాగాలను, వైద్య సేవలందించే వార్డులు పరిశీలించారు. అనంతరం డీసీహెచ్ఎస్, ఆసుపత్రి కమిటీ సభ్యులు, వైద్యాధికారులతో మాట్లాడుతూ సిబ్బంది పనితీరు, ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, ఆసుపత్రిలో జరుగుతున్న ఆపరేషన్లు వంటి విషయాలపై చర్చించారు. అనంతరం రుస్తుంబాద అలంకృతి లేసు పార్కును కలెక్టర్ సందర్శించారు. అక్కడ మహిళలు అల్లిన పలు విధాల లేసు డిజైన్లను పరిశీలించారు. లేసు అల్లికలతో మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని అన్నారు. అనంతరం మండలంలోని స్వయం సహాయక గ్రూపులు నిర్వహిస్తున్న యూనిట్లను కలెక్టర్ పరిశీలించారు. లక్ష్మణేశ్వరంలో పిండి వంటలు తయారీ యూనిట్, సార్వలో మినీ డైరీ యూనిట్, తూర్పుతాళ్లలో ఫ్లోర్ మిల్లు, పచ్చళ్ళు తయారు చేసే యూనిట్, చామకూరిపాలెంలో డొక్క తాడు పరిశ్రమను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆయా యూనిట్‌లను నడిపే సభ్యులతో మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

6.92 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

భీమవరం: జిల్లాలో ఇంతవరకు 6.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేశామని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ చాంబర్ నుంచి జిల్లాలోని ధాన్యం కొనుగోలు సేకరణపై డివిజన్, మండల స్థాయి కమిటీలతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పుల దృష్ట్యా రైతులకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ధాన్యాన్ని ఏఎంసీ గోదాముల్లో, టార్పాలిన్‌తో కప్పి భద్రపరచాలని అన్నారు. మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. మండల స్థాయిలో ఇచ్చిన నివేదిక ప్రకారం ధాన్యం కొనుగోలు లక్ష్యాలను కేటాయించామన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఏమైనా సమస్యలు ఉంటే రైతు సేవా కేంద్రాలు, మండల స్థాయి అధికారులు లేదా జిల్లా టోల్ ఫ్రీ నెంబర్ 8121676653కు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని జాయింట్ కలెక్టర్ అన్నారు.

జగన్‌ను కలసిన యలమంచిలి ఎంపీపీ



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఎంపీపీ ధనలక్ష్మి, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి తదితరులు

యలమంచిలి: యలమంచిలి మండలం ఎంపీపీ ఎన్నికలో విజయం సాధించిన ఇనుకొండ ధనలక్ష్మి రవికుమార్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పాలకొల్లు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ఎన్నిక వివరాలను వెల్లడించారు. జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వారిలో వైస్ ఎంపీపీలు గొల్లపల్లి శ్రీనివాస్, కొప్పాడి శ్రీనుబాబు, మాజీ ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఉచ్చుల స్టాలిన్ బాబు, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ నాయకులు చిలువూరి కుమార దత్తాత్రేయ వర్మ, మాజీ డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ కుక్కల బాలచంద్రన్, నిమ్మకాయల రామకృష్ణ ఉన్నారు.

ధాన్యం బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): జిల్లాలో రైతులు, కౌలు రైతులకు చెల్లించాల్సిన రబీ ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించి అన్నదాతలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక అన్నే భవనంలో ధాన్యం బకాయిల సమస్యలపై మంగళవారం ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు సందర్భంగా రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. చివరి దశలో కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి దాదాపు రూ.89 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. గత 15 రోజులుగా ధాన్యం సొమ్ములు చెల్లింపులు నిలిచిపోవడంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రబీ పంటకు తెచ్చిన పెట్టుబడి అప్పులు తీర్చి ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావాల్సిన దశలో ధాన్యం బకాయిలు చెల్లించకపోవడం తగదన్నారు. చివరి దశలో కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన బకాయిలు కూడా చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ధాన్యం సొమ్ము అందాల్సిన బైరెడ్డి లక్ష్మణరావు మాట్లాడుతూ ఏలూరు శివారు సుంకరి వారి తోటకు చెందిన తనకు గత 15 రోజులు క్రితం తోలిన ధాన్యానికి సొమ్ములు అందలేదన్నారు. ధాన్యం బకాయిలు చెల్లించి ఆదుకోవాలని కోరారు.

గ్రేడ్ -2 హెచ్‌ఎంల బదిలీల ప్రక్రియ ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రభుత్వ/జిల్లా పరిషత్/మున్సిపల్ కార్పొరేషన్/మున్సిపాలిటీ యాజమాన్యాల్లో పనిచేస్తున్న గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుల బదిలీ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తప్పనిసరిగా బదిలీ అయ్యేవారు, అభ్యర్థన బదిలీ కోసం దరఖాస్తు చేసుకునేవారు బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో బదిలీల కోసం దరఖాస్తు పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులు సంసిద్ధంగా ఉండాలని వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



పాత బస్టాండ్ సెంటర్‌లో కార్మిక సంఘాల నిరసన

ఏలూరు (టూటౌన్): కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడి ప్రసాద్, ఏఐటీయూసీ అధ్యక్షుడు ఆర్ శ్రీనివాస, ఐఎఫ్‌టీయు నాయకుడు గడసాల రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను తక్షణమే విడనాడాలని డిమాండ్ చేశారు. జూలై 9న దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొని నిరసన తెలియజేయాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలను కార్పొరేట్లకు, ప్రైవేటు వ్యక్తులకు కారుచౌకగా మోదీ ప్రభుత్వం అప్పగిస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే. శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, బి.సోమయ్య, వీవీఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు వెనుక భాగం

భీమడోలు హైవేపై అర్ధరాత్రి బీభత్సం

- ఆగివున్న వ్యాన్‌ను ఢీకొన్న మరో వ్యాన్
- అక్కడికక్కడే బాలుడు మృతి
- తీవ్ర గాయాలతో వ్యాన్‌లో ఇరుక్కుపోయిన దంపతులు
- పోలీసులు బార్కర్లను ఏర్పాటుచేసి వారిని బయటికి తీస్తుండగా మరో ప్రమాదం
- శరవేగంగా వస్తూ ఒకదాన్నొకటి ఢీకొన్న 3 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు
- డ్రైవర్ సహా 8 మందికి గాయాలు

భీమడోలు : గుండుగొలను – తాడేపల్లిగూడెం జాతీయ రహదారిపై భీమడోలు వద్ద అర్ధరాత్రి జరిగిన వరుస రోడ్డు ప్రమాదాలు బీభత్సం సృష్టించాయి. ఈ ఘటనల్లో ఒక బాలుడు మృతిచెందగా, 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదాలకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. భీమడోలు వద్ద జాతీయరహదారిపై ఆగి వున్న డీసీఎంఎస్ వాహనాన్ని వెనుక నుంచి వ్యాన్ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తణుకుకు చెందిన రామ్‌చరణ్ (17) అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి 12 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో అదే వాహనంలో ఇద్దరు దంపతులు తీవ్ర గాయాలతో క్యాబిన్‌లోకి ఇరుక్కుపోయారు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్ఐ వై.సుధాకర్ వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ బార్కర్లను ఏర్పాటు చేసి దంపతులను బయటికి తీసేందుకు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో సుమారు 12.30 గంటల వేళ తాడేపల్లిగూడెం మీదుగా హైదరాబాద్ వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు శరవేగంగా వస్తూ బార్కర్లను ఢీకొట్టింది. దాని వెనుక వస్తున్న మరో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దీనిని ఢీకొనగా, దాని వెనుక వస్తున్న మూడో బస్సు రెండో బస్సును ఢీకొట్టింది. మొత్తం మూడు ట్రావెల్స్ బస్సులు ఒకదాని వెనుక మరొకటి ఢీకొనగా, మధ్యలో ఉన్న బస్సు డ్రైవర్‌కి, 8 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడినవారిని పోలీసులు వెంటనే ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మిగిలిన బస్సుల్లో ఎంతమంది గాయపడ్డారనేది తెలియాల్సి ఉంది. పోలీసులు తక్షణ సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.



భీమడోలు హైవేపై రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాలుడు

క్లుప్తంగా

మట్టి తవ్వకాల అడ్డగింత



యంత్రాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

చాట్రాయి: చనుబండ గ్రామంలోని పెద్ద చెరువులో మట్టి అక్రమ తవ్వకాలను అధికారులు అడ్డుకున్నారు. సోమవారం అర్ధరాత్రి మట్టి తవ్వకాలు చేస్తున్నారని సమాచారం రావడంతో రెవెన్యూ సిబ్బంది, పోలీసులు ఆ ప్రదేశానికి చేరుకుని ఒక పొక్లయిన్, జేసీబీని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నాలుగు రోజుల క్రితం మట్టి తవ్వకాలకు అనుమతి కావాలంటూ కొందరు అధికారులకు అర్జీ ఇచ్చారు. అర్జీ ఇచ్చినందుకు ఇచ్చిన రసీదుని చూపించి మూడు రోజులపాటు అక్రమంగా మట్టిని తరలించారు. సోమవారం రాత్రి సమాచారం అందుకున్న అధికారులు రెండు యంత్రాలను సీజ్ చేశారు.

పారిజాతగిరీశుడికి శేష వాహన సేవ



శేషవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వేంకటేశ్వర స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. రాజమండ్రికి చెందిన పండితులు పాండంగిపల్లి దుర్గా రామ సత్య పవన్ కుమార్ ఆచార్యులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, ధ్వజ రోహణం, అగ్ని ప్రతిష్ఠ, కుంభ స్థాపన, నిత్య హోమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అత్యంత వైభవంగా శేష వాహన సేవ జరిపారు. సంతానం లేని భక్త దంపతులు స్వామివారి గరుడ ప్రసాదం స్వీకరించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మద్ది క్షేత్రంలో విశేష పూజలు



ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామి వారి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు జరిపారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం వరకు ఆలయానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.1,87,132 ఆదాయం వచ్చినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. నిత్యాన్నదాన సత్రంలో సుమారు 1600 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారన్నారు. ఈవో చందన మాట్లాడుతూ క్షేత్రంలో హనుమద్ జయంతి సహిత కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 21 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం స్వామి వారి నిజరూప సందర్శనం (సింధూరం వలుపు) అనంతరం విశేష దర్శనములు ఉంటాయన్నారు.

శ్రమజీవులకు ఎంత కష్టం..

- ద్వారకాతిరుమలలో వ్యాన్ బోల్తా పడి 14 మందికి గాయాలు
- గుండుగొలనులో లారీ అదుపు తప్పి ఏడుగురు కూలీలకు గాయాలు



ద్వారకాతిరుమల: మండలం లైన్ గోపాలపురం జాతీయ రహదారిపై బోల్తా పడిన వ్యాన్

ద్వారకాతిరుమల: వేర్వేరుగా జరిగిన రెండు ప్రమాదాల్లో 20 మంది కూలీలు, ఒక డ్రైవర్ గాయపడ్డారు. ద్వారకాతిరుమల మండలంలోని లైన్‌గోపాలపురం జాతీయ రహదారిపై ఎండు కొబ్బరి కాయల లోడుతో వెళుతున్న బొలేరో వాహనం వెనుక టైరు పేలడంతో అదుపు తప్పి బోల్తా పడగా 14 మంది గాయాలపాలయ్యారు. గుండుగొలను శివారు బీసీ కాలనీ వద్ద చేపల చెర్వులకు మేత తరలిస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడడంతో ఏడుగురు కూలీలు గాయపడ్డారు.

టైరు పేలి బోల్తా పడ్డ వ్యాన్

ద్వారకాతిరుమల మండలం కప్పలకుంట నుంచి ఎండు కొబ్బరి కాయల లోడుతో బొలేరో వాహనం దెందులూరు మండలం గోపన్నపాలెంకు వెళుతోంది. లైన్ గోపాలపురం జాతీయ రహదారిపైకి వచ్చేసరికి వాహనం వెనుక టైరు పేలింది. ఈ ప్రమాదంలో 5 గురు తీవ్రంగా, 9 మంది స్వల్పంగా గాయపడ్డారు. డ్రైవర్ వాన కిషోర్‌తో పాటు, వాహనంపై ఉన్న గోపన్నపాలెం, వేగవరంనకు చెందిన 13 మంది కూలీలు కొండేటి గంగాధరరావు, కాసగాని ఆంజనేయులు, బెజవాడ రత్తయ్య, వాన తిరుపతి, మోర్ల రాము, ఆరే రామకృష్ణ, తాడి సత్యవతి, తాడి సంతోష్, అప్పలనాయుడు, ఒగ్గుల చరణ్, బి.అప్పన్న, ఐక రాంబాబు, రెగాన రామ్మూర్తి, బోణె అప్పమ్మ తదితరులు గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను 108, హైవే ఆంబులెన్స్‌లో హుటాహుటీన భీమడోలు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం తీవ్రంగా గాయపడ్డ ఆంజనేయులు, సంతోష్, అప్పలనాయుడు, సత్యవతి, గంగాధరరావు లను ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



ద్వారకాతిరుమల: క్షతగాత్రులకు 108 ఆంబులెన్స్‌లో ప్రథమ చికిత్స చేస్తున్న సిబ్బంది



భీమడోలు: గుండుగొలను శివారు రత్నాపురం రోడ్డులో బోల్తా పడిన చేపల మేత లోడు లారీ

లారీ బోల్తా.. కూలీలకు గాయాలు

భీమడోలు: తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం నుంచి గుండుగొలను శివారు రత్నాపురంలోని ఆక్వా చెర్వులకు మేత తవుడు దిగుమతి చేసేందుకు లారీ వచ్చింది. లారీ డ్రైవర్ సత్తార్ తవుడు దించేందుకు జట్టు కూలీలను పురమాయించుకుని ఆక్వా చెరువుల వద్దకు వెళుతుండగా గుండుగొలను శివారు బీసీ కాలనీ వద్ద గల మలుపు వద్దకు వచ్చేసరికి లారీ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో లారీ కేబిన్‌లో ఉన్న కూలీలు బూరి తిరపతయ్య, పెద్దింటి కృష్ణ, మంత్రి పాపారావు, చిగడాపు వెంకన్న, గొర్ల శ్రీను, నేలబుల్లి సూర్యానారాయణలతో మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భీమడోలు పోలీసులు తెలిపారు.

చినవెంకన్న బంగారం.. బ్యాంకులో భద్రం



ఆలయ స్ట్రాంగ్ రూమ్ వద్ద బంగారం ప్యాకింగ్‌కు సీల్ వేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారికి భక్తుల నుంచి ఏడాది కాలంగా హుండీలు, కానుకల ద్వారా లభించిన 4.940 కేజీల బంగారాన్ని దేవస్థానం అధికారులు గోల్డ్ బాండ్ స్కీమ్ కింద విజయవాడలోని భారతీయ స్టేట్‌బ్యాంక్ మెయిన్ బ్రాంచ్‌లో మంగళవారం డిపాజిట్ చేశారు. ముందుగా ఆలయ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచిన బంగారాన్ని ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి, డిప్యూటీ ఈఓ పి.బాబురావు, దేవాదాయశాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి (రాజమహేంద్రవరం) వీవీ పల్లంరాజు, ఆలయ అర్చకులు కొండూరి జనార్ధనాచార్యులు, కమిటీ సభ్యుల సమక్షంలో బయటకు తీశారు. అనంతరం బంగారాన్ని తూకం వేసి, ప్యాక్ చేశారు. ఆ ప్యాకెట్‌కు సీలు వేసి, సంబంధిత పత్రాలతో పాటు దాన్ని బ్యాంకు అధికారులకు ఆలయ ఈఓ సత్యన్నారాయణ మూర్తి, కమిటీ సభ్యులు అందజేశారు.

జూన్ 10న ఆక్వా రైతుల చలో అమరావతి

- ప్రభుత్వం హెచ్చరికలను బేఖాతర్ చేస్తున్న ప్రాసెసింగ్, ఫీడ్ కంపెనీలు
- క్రాఫ్ హాలిడేకు మద్దతుగా రైతులు సమాయత్తం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గాంధీభగవాన్ రాజు

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వం హెచ్చరించినా ధరల విషయంలో ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, ఫీడ్ కంపెనీలు దిగిరావడం లేదని, దీంతో ఆక్వా రైతులందరూ చలో అమరావతి కార్యక్రమాన్ని చేపట్టనున్నామని ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు తెలిపారు. మంగళవారం పాలకొల్లు మండలం పూలపల్లి ఎస్ఎస్ఎస్ కళ్యాణ మండపంలో జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాంధీభగవాన్ రాజు మాట్లాడుతూ అమెరికా పన్నులు పెంచిందని ఇక్కడ ప్రాసెసింగ్ యూనిట్ సభ్యులు కొనుగోలు నిలుపుదల చేశారని తెలిపారు. సరుకు పట్టుబడులు పట్టుకున్న రైతులు గగ్గోలు పెడితే రూ.50 నుంచి రూ.100 వరకూ ధరలను తగ్గించేశారని అన్నారు. దీనిపై జై భారత్ ఆక్వా సంఘం స్పందించి ఎంతో పోరాటం చేసి క్రాప్ హాలిడే ప్రకటించడం జరిగిందన్నారు. క్రాఫ్ హాలిడేకు మద్దతుగా ఇప్పటికే పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజకవర్గాల్లో కొన్ని గ్రామాల్లో రైతులు చెరువులను ఎండగట్టే పనిలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. అలాగే ఫీడ్ కంపెనీలు ముడి సరుకు ధరలు పెరిగితే వెంటనే రూ. 25 పెంచేసి, ధరలు తగ్గినప్పుడు కేవలం రూ.4 లేక రూ.5 తగ్గించడం దారుణమన్నారు. 60 కౌంట్‌ను మినిమమ్‌గా నిర్ణయించాలని, ధర రూ.320 చేయాలని డిమాండ్ చేశారు. వీటిపై ప్రభుత్వం ప్రభుత్వం స్పందించి తగిన న్యాయం చేయకుంటే క్రాఫ్ హాలీడే తథ్యం అని స్పష్టం చేశారు. చలో అమరావతి కార్యక్రమాన్ని రైతులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బోణం చినబాబు, బోణం రంగయ్యనాయుడు, ఆర్ సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక శ్రద్ధ

ఏపీఎంఐపీ పీడీ డాక్టర్ వెంకటరమణ



ప్రాంతీయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుందని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సీ.వెంకటరమణ, ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రంలో వివిధ జిల్లాలకు చెందిన ఉద్యాన శాఖ అధికారులు, రైతులతో ప్రాంతీయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం సహాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ డి.వెంకటస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ టమాట, మిరపలో ప్రాసెసింగ్ టెక్నాలజీలను పెంపొందించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కోత అనంతరం పండ్ల తోటల్లో నష్టాన్ని అంచనా వేయడం, తద్వారా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అరటి దిగుబడిలో కోస్తా జిల్లాలతో పోలిస్తే రాయలసీమ ముందంజలో ఉందని, దానికి కారణాలు వెతకాలన్నారు.

ఏఐని ఉపయోగించి తెగుళ్ల ఉద్ధృతిని అరికట్టాలి

రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ విదేశీ పంటల సాగుపై దృష్టి పెట్టాలన్నారు. ఈ పంటల సాగుపై రైతులకు కావలసిన సూచనలను, సలహాలను శాస్త్రవేత్తలు అందించాలన్నారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటగా సాగు చేసే కోకోలో కొత్త రకాలను తీసుకురావాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఆధారం చేసుకుని పురుగు, తెగుళ్ల ఉధృతిని, ఉనికిని కనిపెట్టడం, అవసరాన్ని బట్టి ఎరువులు, నీటి యాజమాన్యం చేపట్టాలన్నారు. వాతావరణ మార్పులకనుగుణంగా పంటల్లో పురుగు, తెగుళ్ల ఉధృతిపై విస్తారంగా పరిశోధనలు జరగాలన్నారు. ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ జమదగ్ని, ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ కే.టి.వెంకటరమణ, యూనివర్సిటి డీఐపీ అధికారి డాక్టర్ కే.ధనుంజయరావు, విస్తరణ పంచాలకులు డాక్టర్ బి.గోవిందరాజులు, పరిశోధన సహాయ సంచాలకులు కోస్టల్ జోన్-1 డాక్టర్ డి.వెంకటస్వామి, కోస్టల్ జోన్-1 డాక్టర్ సి.వెంకటరమణ గత ఏడాదికి గాను అధికారులు, రైతులు అడిగిన సమస్యలకు పరిష్కారాలపై చేపట్టిన పరిశోధనలు తెలిపారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్‌బీవీ.చలపతిరావు, డాక్టర్ ఇ.కరుణశ్రీ, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త విజయలక్ష్మి, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన ఉద్యాన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ట్రస్ట్ బోర్డుల నియామకానికి నోటిఫికేషన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాలు, సత్రాలకు ట్రస్ట్ బోర్డులను నియమించడానికి నోటిఫికేషన్ విడుదలైంది. ట్రస్టీలుగా నియామకాల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు దరఖాస్తులు పూర్తి చేసి దేవాదాయ శాఖ ఏలూరు జిల్లా అధికారి కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. ఈ మేరకు ట్రస్ట్‌బోర్డులను నియమించే ఆలయాల జాబితాను ఆ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ విడుదల చేశారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి.

శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం (జంగారెడ్డిగూడెం), శ్రీ వేగిలింగేశ్వర స్వామి దేవస్థానం (చింతలపూడి), శ్రీ గాంగేశ్వర స్వామి దేవస్థానం (తడికలపూడి, కామవరపుకోట మం.), శ్రీ సీతారామ స్వామి దేవస్థానం (రావికంపాడు, కామవరపుకోట మం.), శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ రాజగోపాల స్వామి దేవస్థానం (కలపర్రు, పెదపాడు మం.), శ్రీ సీతా రామ స్వామి దేవస్థానం (సానిగూడెం, దెందులూరు మం.), శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం (అప్పనవీడు, పెదపాడు మం.), ఏలూరుకు చెందిన శ్రీ గాంధీ ఆంధ్ర జాతీయ మహావిద్యాలయం, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం (పడమర వీధి), శ్రీ కంది అయ్యన్న సత్రం, శ్రీ రంగ్రీజుల మఠం, శ్రీ చెరుకువాడవారి సత్రం, శ్రీ చౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ రామమందిరం (తూర్పు వీధి), శ్రీ చుండూరువారి సత్రం, శ్రీ మద్దులవారి సత్రం, శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం (పత్తేబాద), శ్రీ మార్కండేయ ఓంకార విశ్వేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ తలాటం పట్టయ్య సుబేదార్ సత్రం, శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం (12 పంపుల సెంటర్), శ్రీ నల్ల బసవలింగం సత్రం, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం (ఆర్‌ఆర్ పేట), కైకలూరుకు చెందిన శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ కనకలింగేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ శ్యామలాంబ అమ్మవారి దేవస్థానం, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ కనకలింగేశ్వరస్వామి దేవస్థానం (ఆటపాక, కైకలూరు), శ్రీ గోకర్ణేశ్వరస్వామి దేవస్థానం (గోకర్ణపురం, కైకలూరు), శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం, శ్రీ అమృతేశ్వరస్వామి దేవస్థానం (శింగరాయపాలెం, ముదినేపల్లి), శ్రీ నాగేశ్వరస్వామి దేవస్థానం (పెదలంక, కలిదిండి), శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం (కలిదిండి), శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానం (మండవల్లి), శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం, శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం (గురజ, ముదినేపల్లి), శ్రీ లోకేశ్వర, జనార్ధనస్వామి దేవస్థానం (కోడూరు, ముదినేపల్లి), శ్రీ సోమేశ్వరస్వామి దేవస్థానం (కోరుకొల్లు, కలిదిండి).

ములపర్రు సొసైటీలో మరోసారి కలకలం

సీఐడీ అదుపులో మాజీ అధ్యక్ష, కార్యదర్శులు



ములపర్రు సొసైటీ (ఫైల్)

పెనుగొండ: డిపాజిట్లు గల్లంతుతో 2018 నుంచి కలకలం రేపుతున్న ములపర్రు హిందూ ముస్లీం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం మరోసారి కలకలం రేపింది. మంగళవారం సీఐడీ పోలీసులు ఆనాటి అధ్యక్ష, కార్యదర్శులను అదుపులోకి తీసుకోవడంతో మరోసారి వార్తల్లో నిలిచింది. 2017 సంవత్సరం పాలకవర్గ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఆనాటి కార్యదర్శి వెంకటేశ్వరరావు నిధుల గోల్‌మాల్‌కు పాల్పడ్డారంటూ పాలకవర్గంలోని డైరక్టర్లే ఆనాడు రోడ్డెక్కారు. దీంతో డిపాజిట్టుదారులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి డిపాజిట్లు తిరిగి చెల్లించాలంటూ ప్రదక్షిణలు చేశారు. అప్పట్లోనే 51 ఎంక్వయిరీ వేసి పలుమార్లు విచారణ జరిపి, ఎంత మోసం జరిగిందో బయట పెట్టకుండా కాలం వెళ్లబుచ్చారు. రూ.50 లక్షల నుంచి రెండ్లు కోట్లకుపైగా అంటూ రకరకాలుగా ప్రకటించే వారు. చివరకు డిపాజిట్టు దారుల ఒత్తిడి పెరగడంతో అప్పటి కార్యదర్శి వెంకటేశ్వరరావు ఆత్మహత్యాయత్నం సైతం చేశారు. అప్పట్లో రాజకీయ ఒత్తిళ్లతో కేసు ముందుకు సాగకుండా యత్నించారన్న ఆరోపణలు ఉన్నాయి. స్థానికంగా కొందరి పెద్దల సమక్షంలో రాజీ కుదుర్చుకొని కొంత మేర నగదు చెల్లింపులు చేస్తామని హామీ ఇచ్చినా పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. ఈ తరుణంలో ఓ డిపాజిట్టు దారుడు హైకోర్టును ఆశ్రయించడంతో, పూర్తి స్థాయి విచారణ జరిపి నిగ్గు తేల్చాలంటూ సీఐడీకి ఆదేశాలు జారీ చేయడంతో విచారణ చేపట్టారు. విచారణ అనంతరం రూ.రెండు కోట్లకు పైగా నిధుల దుర్వినియోగం జరిగిందని గుర్తించినట్లు సమాచారం.

తణుకులో అదుపులోకి ?

మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, మాజీ కార్యదర్శి వెంకటేశ్వరరావులను మంగళవారం తణుకులో సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో మరోసారి ములపర్రు సొసైటీ డిపాజిట్లు దుర్వినియోగం కేసు కలకలం రేపింది.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న లీగల్ మెట్రాలజీ డీసీ హరి ప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వినియోగదారులు తమ హక్కులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, తూనికలు, కొలతలకు సంబంధించిన చట్టాలను తెలుసుకోవాలని తూనికలు, కొలతల శాఖ ఏలూరు జిల్లా ఉప నియంత్రకులు బి.వెంకట హరిప్రసాద్ అన్నారు. ప్రపంచ తూనికలు, కొలతల దినోత్సవం సందర్భంగా నగరంలోని ఆ శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులకు తాము మోసపోతున్నామని గ్రహిస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. పెట్రోల్ బంకుల్లో కొలతల్లో మోసం జరుగుతున్నా, వస్తువుల తూకాల్లో తేడా ఉన్నట్లు గ్రహించినా వెంటనే అప్రమత్తం కావాలని సూచించారు. వ్యాపారస్తులు వినియోగదారులకు అందించాల్సిన సేవలు, వ్యాపారస్తులు పాటించాల్సిన నియమ నిబంధనలపై వివరించారు. అలాగే వ్యాపారస్తులు ఉత్పత్తి చేసి, విక్రయించే ప్రతి ప్యాకేజీపై తయారీదారుని పేరు, ప్యాకేజీ చేయబడిన వస్తువు పేరు, దాని నికర బరువు ముద్రించాలన్నారు. కార్యక్రమంలో సహాయ నియంత్రకులు బీఎస్‌వీఎస్ ఈశ్వర రామ్, పరిశీలకులు వి. ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలిక అదృశ్యం

ఉండి: మైనర్ బాలిక అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉండి మండలం చినపుల్లేరు గ్రామానికి చెందిన మైనర్ బాలిక (16) సోమవారం రాత్రి ఇంట్లోనే నిద్రించింది. తెల్లవారుజామున బాలిక కనిపించడంతో కుటుంబీకులు చుట్టుపక్కల వెదికినా కనిపించకపోవడంతో ఆమె తల్లి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏలూరులో చోరీ

ఏలూరు టౌన్: ఏలూరు రామకృష్ణాపురంలోని ఒక ఇంట్లో దొంగలు పడి నగదు, నగలు అపహరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. వీరంకి వెంకటలక్ష్మి ఇంటికి తాళం వేసి అదే ప్రాంతంలోని తన కుమార్తె ఇంటికి ఈనెల 17వ తేదీ రాత్రి వెళ్లి మరుసటి రోజు మధ్యాహ్నం తిరిగి వచ్చారు. ఇంటి తలుపులు తెరచి ఉండడం, రూ.25 వేల నగదు, అర కాసు బంగారపు వస్తువులు అపహరణకు గురైనట్లుగా గుర్తించి మంగళవారం ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఒక యువకుడు ఎలుకల మందు బిళ్లలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భీమడోలు మండలం చెట్టున్నపాడు గ్రామానికి చెందిన మాగాబత్తిన మిల్కీయర్ తన భార్య, ఇద్దరు కుమారులతో కలిసి దెందులూరు మండలం దోసపాడు గ్రామ పరిధిలోని చేపల చెరువుపై కాపలా ఉంటున్నాడు. చిన్న కుమారుడు అఖిల్ బాబు (17) మంగళవారం సాయంత్రం ఎలుకలు మందు బిళ్లలను మింగేశాడు. కుటుంబ సభ్యులు గమనించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడు ఏకారణం చేత ఆత్మహత్యకు పాల్పడ్డాడో తెలియలేదు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు మెడికో లీగల్ కేసు నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.


వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

అత్తిలి: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి ప్రేమరాజు మంగళవారం తెలిపారు. అత్తిలి మండలం కొమ్మర గ్రామానికి చెందిన యరసాని మేరి భర్త ఈనెల 13వ తేదీ రాత్రి చేపలచెరువుపై డ్యూటీకి వెళ్లాడని, మరసటి రోజు ఉదయానికి మేరీ కనిపించలేదని, ఆమె సోదరుడు కావాడి ఏసు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమరాజు చెప్పారు.

ఆరు రైళ్ల రద్దు

ఏలూరు టౌన్: ఏలూరు మీదుగా నడుస్తున్న ఆరు రైళ్లను వివిధ కారణాలతో రద్దు చేస్తూ దక్షిణమధ్య రైల్వే అధికారులు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. రద్దు చేసిన రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 21న షాలిమర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే (22849) రైలు, 22న సత్రగంజి నుంచి యశ్వంతపూర్ వెళ్లే (02863) రైలు, 23న హౌరా నుంచి మైసూర్ వెళ్లే (22817) రైలు, సికింద్రాబాద్ నుంచి బయలుదేరి షాలిమార్కు వెళ్లే (22850) రైలు, 24న యశ్వంత్‌పూర్ నుంచి సత్రగంజి వెళ్లే (02864) రైలు, 25న మైసూర్ నుంచి హౌరా వెళ్లే (22818) రైలు.

అడ్మిషన్ల కోసం తల్లిదండ్రుల ధర్నా



కళాశాల వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కామవరపుకోట: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం స్థానిక శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం ధర్నా నిర్వహించారు. అడ్మిషన్లు తీసుకోకుండా కాలేజీ యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తూ పిల్లల భవిష్యత్తు నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. 42 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ కాలేజీని మూసివేసే ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు కాగా దీనిపై కళాశాలకు వచ్చిన ఆర్‌ఐఓ యోహాన్‌ను వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాల మేరకు కళాశాలకు వచ్చానని కానీ ఇక్కడ తిరుపతి దేవస్థానం ఈవో చెబితేనే గాని అడ్మిషన్లు ఇవ్వమని యాజమాన్యం చెప్పారని త్వరలో అడ్మిషన్ తీసుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

క్లుప్తంగా

రంగస్థల కళాకారులకు నిత్యావసర సరుకులు అందజేత



తణుకులో కళాకారులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

తణుకు అర్బన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధ రంగస్థల కళాకారులకు నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్థానిక అసోసియేషన్ భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వక్తలు కళారంగంలో కళాకారుల పాత్రను కొనియాడారు. అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకరచౌదరి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, భారతీదేవి, నల్లజర్ల వెంకన్న, కార్యదర్శి ఎండీ స్వాలిహో, కోశాధికారి అర్జి భాస్కరరావు, సహాయ కార్యదర్శి ఎస్.రామకృష్ణారావు, నాదెండ్ల కృష్ణానందం, సభ్యులు కె.రామమోహనరావు పాల్గొన్నారు.

23న ఉచిత మెగా వైద్య శిబిరం



క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజల శ్రేయస్సు కోసం స్థానిక జువ్వలపాలెంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ కైండ్‌నెస్, ఆశ్రమ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో పాలూరి నాగ బలుసులరావు సౌజన్యంతో మే 23న శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. జనరల్ మెడిసిన్, కంటి వైద్య పరీక్షలు, ఆర్థోపెడిక్, స్త్రీ, ప్రసూతి, చెవి, ముక్కు, గొంతు, చర్మవ్యాధులు, రేడియాలజీ తదితర విభాగాలలో సేవలు అందజేస్తారన్నారు. అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. వైద్య శిబిరం బ్రోచర్‌ను మంగళవారం కైండ్‌నెస్ క్లబ్ విడుదల చేసింది. కైండ్‌నెస్ సొసైటీ అధ్యక్షుడు గట్టిం మాణిక్యాలరావు, క్లబ్ అధ్యక్షుడు గట్టిం ప్రవీణ్ కృష్ణ, సభ్యులు పాండురంగారావు, పిల్లా వెంకన్న బాబు, జి.నవీన్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 4 విషయంలో పునరాలోచించాలి



అత్తిలి తహసీల్దార్ దశిక వంశీకి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

అత్తిలి: సచివాలయ వ్యవస్థలో రేషనలైజేషన్ జీఓ నంబర్ 4 విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతూ అత్తిలి మండల వీఆర్వోలు మంగళవారం తహసీల్దార్ దశిక వంశీకి వినతిపత్రం అందజేశారు. నూతన విధానంతో రెండు సచివాలయాలకు కలిపి ఒక వీఆర్వోను ఏర్పాటు చేస్తున్నారని, దీనివల్ల తీవ్రమైన ఒత్తిడి, పనిభారం ఉంటుందని వీఆర్వోలు తెలిపారు.

గూడెంలో భారీ వర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో మంగళవారం రాత్రి 8.30 గంటలకు ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతంగానే ఉంది. ఉదయం సమయంలో పిడుగు లాంటి శబ్దాలతో జల్లులు కురిసినప్పటికీ రోజు అంతా చిన్నపాటి జల్లులు మినహా భారీ వర్షం కురవలేదు. అయితే రాత్రి అవ్వగానే ఒక్కసారి భారీ వర్షం పడటంతో పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వారు వర్షం కారణంగా ఇబ్బందులు పడ్డారు.

హనుమద్ జయంతి ఉత్సవాలకు సర్వం సిద్ధం



బల్లిపాడులో అభయాంజనేయస్వామి విగ్రహం

అత్తిలి: ఈనెల 22న జరిగే హనుమద్ జయంతి ఉత్సవాలకు మండలంలోగల ఆంజనేయ స్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాలు సందర్భంగా పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. బల్లిపాడు గ్రామంలో గల అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద హనుమద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఇదేనా స్వచ్ఛాంధ్రప్రదేశ్!

- అనారోగ్యాలకు నిలయంగా గ్రామాలు
- ఏ గ్రామం చూసినా ఏమున్నది గర్వకారణం
- చెత్తాచెదారాలు, అపారిశుద్ధ్యం



తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు గ్రామంలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఏ గ్రామం చూసినా ఏమున్నది గర్వకారణం చెత్తా చెదారాలు, అపారిశుద్ధ్యం అన్న చందంగా గ్రామాలు తయారయ్యాయి. గ్రామాలకు ప్రారంభంలోనూ, శివారులో చెత్తాచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు వాహనదారులకు స్వాగతం పలుకుతున్నాయి. ప్రధానంగా లింగారాయుడిగూడెం, కడియద్ద, జగన్నాథపురం, ఎల్.అగ్రహారం, పుల్లాయగూడెం, పెదతాడేపల్లి, కుంచనపల్లి, మాధవరం, నవాబుపాలెం, జగ్గన్నపేట, మెట్ట ఉప్పరగూడెం, ఉప్పరగూడెం, మోదుగగుంట, అప్పారావుపేట తదితర గ్రామాల్లో పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తగా సేకరిస్తున్న వాటిని ప్రధాన రహదారుల వెంబడి వేసి తగులబెట్టడం గమనార్హం. పలు గ్రామాల్లో దుర్గంధం సైతం వెదజల్లుతున్నాయి. లక్షలాది రూపాయలు వ్యయంతో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయని ప్రజలు నిశితంగా విమర్శిస్తున్నారు.

> **డ్రెయినేజీలు బాగోలేవు**
>
> డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్లపైనే నీరు నిలుస్తోంది. రహదారులపై నడవలేని పరిస్థితి. అంతే కాకుండా రాత్రి సమయాల్లో దోమలు ముప్పేట దాడి చేస్తున్నాయి. రానున్నది వర్షాకాలం. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలి.
>
> – పోలిమోను సతీష్, ఎల్.అగ్రహారం, తాడేపల్లిగూడెం మండలం

కనీసం ఆయా కేంద్రాల్లో వర్మీకంపోస్టు తయారీ ప్రక్రియ సైతం కానరాని పరిస్థితి. చెత్త నుంచి సంపద తయారీపై కార్యక్రమాల నిర్వహణకు మినహా సంపద సృష్టి నీటి మీద రాతలా మారుతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు లింగారాయుడిగూడెం గ్రామంలోని రహదారులపై వర్షపు నీరు నిలిచిన పరిస్థితి నెలకొంది. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో దోమలు విజృంభిస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలనికోరుతున్నారు.



కొండ్రుప్రోలు చెత్త నుంచి సంపద కేంద్రాల్లోని నాడెప్ పిట్‌లలో మొలిచిన మొక్కలు



ఎల్.అగ్రహారం గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నీరు పొంగి రోడ్లపై ప్రవహిస్తున్న దృశ్యం



లింగారాయుడిగూడెం గ్రామంలో రోడ్లపై మురుగునీరు

22న తణుకులో అగ్నిమాపక సామగ్రి వేలం

తణుకు అర్బన్: తణుకు అగ్నిమాపక కేంద్రంలో 1, 2 లిస్టుల్లో ఉన్న పాడైన అగ్నిమాపక పరికరాలు, రబ్బర్ లైనెడ్ డెలివరీ హోజెస్, ఫైర్ ఫైటింగ్ సామగ్రి బహిరంగవేలం వేస్తున్నట్లు అగ్నిమాపక కేంద్ర అధికారి ఐ.అజయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 22వ తేదీన తణుకు అగ్నిమాపక కేంద్ర ఆవరణలో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్న ఈ బహిరంగ వేలంలో పాల్గొనే వారు పాట దక్కించుకున్న అనంతరం పూర్తి పైకాన్ని చెల్లించి వస్తు సామగ్రిని తీసుకువెళ్లాలని కోరారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే వేలం నిలిపివేయుటకు జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారికి రద్దు చేసే అధికారం ఉందని తెలిపారు.

22 నుంచి పడాలలో క్రీస్తు సువార్త సభలు

పెంటపాడు: ఈనెల 22 నుంచి మూడు రోజుల పాటు పడాల మార్కెట్ యార్డు వద్ద క్రీస్తు సువార్త రక్షణ స్వస్తత సభలు నిర్వహించనున్నట్లు జిలా పాస్టర్ల సంఘ అధ్యక్షుడు కె.జాజిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ వ్యవస్థాపకురాలు ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఈ సభలకు హైదరాబాద్‌కు చెందిన అంతర్జాతీయ వర్తమానికులు బ్రదర్ అనిల్‌కుమార్, హైదరాబాద్ కల్వరి చర్చికి చెందిన జోసఫ్ ప్రకాష్, విజయవాడ బేతేల్ చర్చికి చెందిన బ్రదర్ ఎనోష్‌కుమార్ తదితరులు ఈ సభలలో దేవుని వాక్యం బోధిస్తారన్నారు.

ప్రశాంతంగా ఏపీ ఈఏపీ సెట్



కళాశాలలో విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కళాశాలల్లో ప్రవేశాలకు గాను నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్ ప్రవేశ పరీక్ష రెండోవ రోజు మంగళవారం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం, సాయంత్రం రెండు పూటల పరీక్షలు జరిగాయి. 479 మందికిగాను 429 మంది పరీక్షలకు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు, పరిశీలికులుగా విచ్చేసిన ప్రొఫెసర్ సుభాష్, టెస్ట్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్, టీసీఎస్ సంస్థ ప్రతినిధులు పర్యవేక్షించారు. హాల్ టిక్కెట్లును పరిశీలించారు.

శశిలో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఫార్మసీ, అగ్రికల్చర్ కళాశాలల్లో ప్రవేశాలకు గాను నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్ ప్రవేశ పరీక్ష రెండోవ రోజు మంగళవారం పట్టణంలోని శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీ ఈఏపీ సెట్ -2025 పరీక్షలు ఉదయం, సాయంత్రం వరకు జరిగాయి. 482 మందికిగాను 452 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పీడబ్ల్యూడీ అభ్యర్థులు ఎవరూ పరీక్షలు రాయలేదు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. కో ఆర్డినేటర్ పి.రాంబాబు తదితరులు పర్యవేక్షించారు.

ఉత్సాహంగా వేసవి శిబిరాలు



వేసవి విజ్ఞాన శిబరంలో విద్యార్థులు



అత్తిలిలో చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులతో కళకళలాడాయి. పట్టణంలోని గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో మంగళవారం వేసవి శిక్షణ శిబిరం బాల బాలికలచే నిర్వహించారు. రిసోర్స్ పర్సన్లుగా హాజరైన ప్రత్తి వీరాస్వామిచే నీతి కథలు, పుస్తక పఠనం, పంచతంత్ర కథలు జరిగాయి. కేవీ సత్యప్రకాష్‌చే అంతర్జాతీయ తేనెటీగలు దినోత్సవం నిర్వహించారు. కొత్త కొత్త ఆవిష్కరణలను వివరించారు. గౌతమ బుద్ధుని జీవిత విశేషాలను వెల్లడించారు. జి.బాపయ్య శర్మచే ఆపరేషన్ సిందూర్‌పై పలు అంశాలను చర్చించారు. గంథాలయ అధికారి వి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భుజించే ఆహారంలో చిరుధాన్యాలు ఉండాలి

అత్తిలి: మనం రోజూ తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలని ఉపాధ్యాయుడు టి నారాయణరావు అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో చిరు ధాన్యాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల రక్తహీనత నివారించవచ్చని అన్నారు. విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక పఠనం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, వి లక్ష్మణరావు, గంధం శేషవేంద్రరావు, ఎస్ దుర్గా ప్రసాద్, వై ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక శ్రీ వాసవి జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారిచే జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామకృష్ణ తెలిపారు. జాబ్ మేళా గురువారం ఉదయం కళాశాలలో జరుగుతుందని, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరవుతారని వెల్లడించారు. జాబ్ మేళాలో అమరరాజా, గాయత్రీ ఆక్వా ఎక్స్‌పోర్ట్స్, ముత్తూట్ ఫైనాన్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు, అపోలో ఫార్మ, డైకిన్, రిలయన్స్, ఎల్ఐసీ ఆఫ్ ఇండియా, అరబిందో ఫార్మో తదితర 14 కంపెనీలచే జాబ్ మేళా ఉంటుందని తెలిపారు. హాజరై విద్యార్థులు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీలకు సంబందించిన సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలు, బయోడేటా ఫొటోలతో సహా రావాలని తెలిపారు నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న కూలీలు

యలమంచిలి: ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కార్మికులు, వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఎం నాయకులు ఆధ్వర్యంలో ఆందోళనలు చేశారు. మండలంలోని ఆర్యపేట, పెనుమద్రు, ఏనుగువానిలంక, చించినాడ గ్రామ సచివాలయాల వద్ద ఉపాధి హామీ కూలీలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, సీపీఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మాసవరపు సుబ్బారావు మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు 200 రోజులు పని, రోజుకి రూ. 600 వేతనం, రూ. 25 లక్షలు ప్రమాద బీమా, పని ప్రదేశంలో మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని, పే స్లిప్‌లు, జాబు కార్డులు, పోస్ట్ ఆఫీస్ ద్వారా వేతనాలు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సచివాలయాల వద్ద నిరసన తెలిపి, ఆయా పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రాలు సమర్పించారు. మహాలక్ష్మి పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి దాతల సహకారం అభినందనీయం

పెంటపాడు: మండలంలోని పెంటపాడు గ్రామంలో అపరకర్మల కోసం నిర్మిస్తున్న షెడ్డుకు దాతలు సహకారం అందజేస్తున్నారు. దీని కోసం దాతలు అందజేస్తున్న సహకారం అభినందనీయమని జనసేన నాయకుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో నిర్మించుకొంటున్న ఈ షెడ్డులో రేవు, వాటర్‌ట్యాంక్, బోర్, చితాభస్మంబద్రపరచే గది, లాకర్, గేటు నిర్మిస్తామన్నారు. ఇప్పటివరకు దాతలు రూ. 3 లక్షలు అందజేశారన్నారు.

చినఅమిరం గ్రామ సచివాలయం సందర్శన

భీమవరం అర్బన్: మండలంలోని చినఅమిరంలో గ్రామ సచివాలయాన్ని మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అకస్మికంగా సందర్శించారు. కొత్త రేషన్ కార్డుల జారీ, కుటుంబ సభ్యుల పేర్ల మార్పులు, చేర్పులు, తొలగింపు, తదితర అంశాలను జేసీ పరిశీలించారు. సరీ్వసులకు అప్లై చేయుటలో సాంకేతిక సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకొని పలు రికార్డులను పరిశీలించారు. డీఎస్‌వో ఎస్.సరోజ, ఏఎస్‌వో ఎం.రవి శంకర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు హరించొద్దు



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ

తణుకు అర్బన్: కార్మికుల హక్కులు హరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుండటం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, మండల కార్యదర్శి గుబ్బల గోపి అన్నారు. మంగళవారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో సీఐటీయూ దేశ వ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఈ దేశాన్ని ముందుకు నడిపిస్తున్న కార్మిక, ఉద్యోగులతో అధర్మ యుద్ధం చేయడం బాధాకరమని అన్నారు. అన్ని ధరలు పెంచుతున్నప్పుడు కనీస వేతనం రూ. 26వేలు ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. ఈ దేశంలో కార్మికులు, రైతులు, ఉద్యోగులు, ప్రజలు సమస్యలపై పోరాటం సాగించే వారిని బీజేపీ శత్రువులుగా చూస్తుందని విమర్శించారు. కార్మికుల హక్కులుకాలరాస్తే కార్మిక ఐక్యత ఏమిటో చూపిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.రమేష్, అంబటి బ్రహ్మాజీ, మందులయ్య, నాగరత్నం, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటాన్ని ఉధృతం చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మికుల హక్కుల కోసం పోరాటాలను ఉధృతం చేద్దామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పిలుపునిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు ఏఐటీయూసీ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పలు కార్మిక కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నాలు, గేటు సమావేశాలు జరిగాయి. ఉదయం మునిసిపల్ కార్మికులు మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి ర్యాలీ నిర్వహించారు. సీడబ్ల్యూసీ, ఎస్‌డబ్ల్యూసీ గోదాములు జట్టు కార్మికులు తమ గోదాముల వద్ద ధర్నా చేశారు. మార్కెట్ యార్డు హమాలీలు యార్డు వద్ద, ఏరియా ఆసుపత్రి వద్ద, పారిశుద్ధ్య సెక్యూరిటీ, ఇతర విభాగాలు కాంట్రాక్టు సిబ్బందిలు నిరసన ప్రదర్శనలలో పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, సెంట్రల్ పే కమీషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓసూరి వీర్రాజు, మండలపర్తి హరీష్, కళింగ లక్ష్మణరావు, తాడికొండ శ్రీనివాసరావు, అల్లం కుమారస్వామి, ముత్యాల జగదీష్, కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

ఇరగవరం: లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు కామన మునిస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం లేబర్ కోడ్స్‌కి వ్యతిరేకంగా ఇరగవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మొత్తం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా ఏర్పాటు చేయడం సరికాదన్నారు. అంగన్ వాడీ యూని యన్ నాయకులు హేమలత, డి పద్మ, గీత కార్మిక సంఘం నాయకలు పాలా సత్యనారాయణ, పెచ్చేటి సుబ్బారావు, పెచ్చేటి నాగేశ్వరరావు, ఉపాధి హామీ పథకం నాయకులు కొప్పిశెట్టి రామకృష్ణ, కొప్పిశెట్టి కుమారి తదితరులు పాల్గొన్నారు.



తణుకు నరేంద్ర సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు



ఇరగవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

లింగ వివక్ష విడనాడాలి



కృష్ణాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

తాడేపల్లిగూడెం రూరల్: బాలికల పట్ల లింగ వివక్ష విడనాడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కృష్ణాయపాలెం అంగన్‌వాడీ కేంద్రం కోడ్‌నెం.127లో బాలికల పట్ల లింగ వివక్ష–అసమానతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ చిరుప్రాయం నుంచే లింగ వివక్ష మూలాలను అరికట్టాలన్నారు. ఆడ, మగ అనే తేడా లేకుండా తల్లిదండ్రులు ఇరువురిని సమానంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్త పి.అనంతలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు జి.సూర్యకుమారి, పి.కనకదుర్గాంబ, పి.ప్రమీల పాల్గొన్నారు.

టంగుటూరి ఆశయ సాధనకు కృషి చేయాలి



తణుకు వైఎస్సార్ పార్కు వద్ద టంగుటూరికి జోహార్లు చెబుతున్న యూత్ నాయకులు

తణుకు అర్బన్: టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతిని మంగళవారం తణుకులో కామేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ పార్కులో ఉన్న టంగుటూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూత్ నాయకులు సూరంపూడి వైభవ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అలుపెరుగని యోధుడిగా పోరాడి ఆంధ్రకేసరిగా ఘనత సాధించారని అన్నారు. నీతి నిజాయతీతో రాష్ట్ర ముఖ్యమంత్రిగా సమర్థవంతమైన పాలన అందజేసిన మహనీయుడు టంగుటూరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గూడూరి రాజా, చేగొండి బ్రహ్మాజీ, జి.చంద్రశేఖర్, దంపనబోయిన దుర్గారావు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలకు నిధుల కొరత

- భారంగా శిబిరాల నిర్వహణ
- స్పందించని అధికారులు



వేసవి విజ్ఞాన శిబిరంలో చెస్, క్యారమ్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

భీమవరం: వేసవి సెలవుల్లో విద్యార్థులో సృజనాత్మకను పెంపొందించడానికి రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలకు నిధులు విడుదల కాకపోవడంతో నిర్వాహకులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రతి ఏటా స్కూళ్లకు వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథాగా గడపకుండా ప్రభుత్వ గ్రంథాలయాల్లో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించడం పరిపాటి. సుమారు 40 రోజుల పాటు ప్రతి రోజూ గ్రంథాలయాల్లో విద్యార్థులు ఉదయం ఎనిమిది నుంచి మూడు గంటల పాటు పలు రకాల ఆటలు, కథలు చెప్పడం, డ్యాన్స్‌లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఏప్రిల్ 28వ తేది నుంచి ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 74 శాఖా గ్రంథాలయాల్లో ప్రారంభమయ్యాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభమైన శిక్షణా శిబిరంలో విద్యార్థులకు పలు రకాల ఆటలు, పాటలు, డ్యాన్స్ నేర్పించడమేగాక వారికి అల్పాహారం, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాల్సి ఉంది.

నిధులు లేక గ్రంథాలయాధికారుల పాట్లు

ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాల నిర్వహణకు గతంలో ప్రభుత్వం ఆయా గ్రంథాలయాల గ్రేడ్లను బట్టి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు నిధులు మంజూరు చేసేది. ఈ నిధులతో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు బ్యానర్లు కట్టడం, శిబిరానికి హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్, బటర్‌మిల్క్ ప్యాకెట్ల పంపిణీ, విజేతలకు బహుమతులు అందించేవారు. అంతే కాకుండా డ్యాన్స్, చెస్, చిత్రలేఖనం, క్యారమ్స్ వంటి వాటిలో శిక్షణ ఇప్పించేవారు. అయితే ఈ ఏడాది శిక్షణా శిబిరాలు ప్రారంభించి దాదాపు 22 రోజులు గడిచిపోయినా ఇప్పటి వరకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో గ్రంథాలయాధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో శిక్షణా శిబిరాలకు హాజరయ్యే విద్యార్థులకు దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో స్నాక్స్, బటర్‌మిల్క్ ప్యాకెట్స్ అందిస్తున్నా జూన్ 6వ తేదీతో ముగిసే శిక్షణా శిబిరంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులివ్వడానికి నిధులు ఎలా సమకూర్చుకోవాలో తెలియక మదనపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేసి వేసవి విజ్ఞాన శిబిరాలు విజయవంతంగా ముగిసే విధంగా తోడ్పాటునందించాలని గ్రంథాలయాధికారులు కోరుతున్నారు.

చైతన్యంతో బాల్య వివాహాలకు చెక్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా బాలల రక్షణ అధికారి రాజేష్

ఆకివీడు: కిశోర బాలికల చైతన్యంతో బాల్య వివాహాలకు చెక్ పెట్టవచ్చని బాలల రక్షణ జిల్లా అధికారి రాజేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో మంగళవారం మహిళా సంరక్షణ కార్యదర్శులకు బాల్య వివాహాలు అరికట్టేందుకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో బాల్య వివాహాల నిరోధక అధికారులు ఎవరనేది వివరించారు. జీఓ నంబర్ 31, 39, 01 ప్రకారం బాలల సంరక్షణ కమిటీలను గ్రామ స్థాయిలో ఏ విధంగా ఏర్పాటు చేయాలో వివరించారు. ఆకివీడు ప్రాజెక్టు సీడీపీఓ వాణీ విజయరత్నం మాట్లాడుతూ బాల్య వివాహాల వలన అన్నీ అనర్థాలేనన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సంస్థ ప్రతినిధి శ్రీనివాస్, సూపర్‌వైజర్ పీఆర్ రత్నకుమారి, నాగలక్ష్మి, జి.పార్వతి, సీహెచ్ హేమలత, సూర్యకుమారి, బాలాకుమారి, మేరీ, నిర్మల పాల్గొన్నారు.